www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 సంచిక: 191 హైదరాబాద్ సోమవారం 03-11-2025 పేజీలు: 05 ఎడిటర్ : తుకోజు గణేష్ బాబు

## సై ఆధ్వర్యంలో నిరాశ్రయులకు దుస్తులు పంపిణి

**సికింద్రాబాద్, నవంబర్ 02 ( సిద్దిపేట పవర్ ):**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో రోడ్ల పక్కన ఫుట్ పాత్ ల మీద జీవనం సాగిస్తున్న నిరాశ్రయులు, సంచారజాతుల కుటుంబాలకు సై ఫౌండేషన్ నిర్వాహకులు ఆదివారం దుస్తులు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. దుస్తులు అందుకున్న నిరాశ్రయులు, సంచార జాతుల వారు సై ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సేవ సభ్యులు పాల్గొన్నారు. సామాజికబాధ్యత తో నిరంతరం విభిన్న సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు.



# పేదల ఇళ్ల కూల్చివేతపై రాహుల్ గాంధీ మౌనం ఎందుకు?

### మేం కట్టాం, మీరు కూలుస్తున్నారు: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

**నన్ను దాటి బుల్డోజర్ వెళ్లాలన్న రాహుల్ ఇప్పుడు ఎందుకు మాట్లాడరు? అంటూ నిలదీత**

**500 రోజుల్లో కేసీఆర్ సర్కార్ తిరిగి వస్తుంది, బాధితులకు న్యాయం చేస్తుందని హామీ**



**తెలంగాణబ్యూరో, సిద్దిపేట పవర్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్ల కూల్చివేతలకు పాల్పడుతోందని, ఈ అన్యాయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లలో తనను దాటి బుల్డోజర్లు వెళ్లాలని సవాల్ విసిరిన రాహుల్ గాంధీ, తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలను ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేపడుతున్న కూల్చివేతలపై కేటీఆర్ ఒక ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గతంలో ఢిల్లీలో మాట్లాడిన పాత వీడియో క్లిప్‌ను ప్రదర్శించారు. "ధనికులకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం" అనే నినాదంతో ఈ ప్రజెంటేషన్ సాగింది. ప్రభుత్వ చర్యల ..మిగతా 2లో

## కేకే సర్వే రిపోర్ట్‌పై కాంగ్రెస్ ఆగ్రహం..

**ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిందని ఆరోపణ**

**కేటీఆర్, హరీష్ డైరెక్షన్‌లో సర్వే విడుదల**

**ఎలక్షన్ కమిషన్ వద్దకు ఫిర్యాదు : బల్మూరి వెంకట్**

2

### తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్

## నూతన కమిటీని ప్రకటించిన కవిత

**కమిటీ వివరాలను వెల్లడించిన జాగృతి అధ్యక్షురాలు కవిత**

**అధ్యక్షుడిగా మోరం వీరభద్రరావు నియామకం**

**ప్రధాన కార్యదర్శిగా జాడి శ్రీనివాస్‌కు బాధ్యతలు**

**టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీకి సూచన**



2

### హైదరాబాద్ ఓటర్లకు

## కేటీఆర్ విజ్ఞప్తి

**గ్రామీణ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయారు**

**ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పాత్రను అద్భుతంగా పోషిస్తున్నాం**

**బీఆర్ఎస్ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం**

**గ్రామీణ ప్రాంతాల్లో కంటే హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుంది**

**విద్యావంతులు ఉన్న HYDలో ఓటింగ్ శాతం తక్కువ ఉండటం బాధాకరం**

**ఓటు వేసేందుకు ముందుకు రాకుంటే.. రిగ్గింగ్ జరిగే అవకాశం ఎక్కువ. -కేటీఆర్**



## కేటీఆర్ హైడ్రా వ్యాఖ్యలపై ఎంపీ చామల కౌంటర్

**కేటీఆర్ హైడ్రా వ్యాఖ్యలపై చామల తీవ్ర విమర్శలు**

**బీఆర్ఎస్ పాలనలో చెరువులు, భూముల కబ్జాలు వెల్లడి**

**హైడ్రా ఏర్పడిన తర్వాత వేల ఎకరాలు రక్షించబడ్డాయన్న ఎంపీ**

**హైడ్రా ప్రజల రక్షణకే పనిచేస్తోందని స్పష్టం చేసిన చామల**



2

## షాద్‌నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత..

### మహిళా కానిస్టేబుల్‌పై విద్యార్థినుల దాడి

ప్రిన్సిపల్ వేధింపులపై విద్యార్థినుల ఆందోళన

షాద్‌నగర్ చౌరస్తాలో ధర్నాతో ఉద్రిక్తత

మహిళా కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్న విద్యార్థినులు

పోలీసులు, విద్యార్థినుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట

కలెక్టర్ వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టీకరణ

కొందరు విద్యార్థినులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



2

## కుల గణనలో తెలంగాణకు జాతీయ స్థాయి గుర్తింపు

**కోకాపేటలో మున్నూరు కాపు భవన నిర్మాణానికి హామీ**

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై మంత్రి స్పష్టం**

**జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌కు మున్నూరు కాపుల మద్దతు**



2

# దమ్ముంటే ఆ పథకం ఆపండి...

**సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు**

**దమ్ముంటే సన్నబియ్యం పథకం ఆపి చూడాలని సీఎంకు సవాల్**

**సన్నబియ్యం పథకం కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం**

**మజ్లిస్ ఓట్ల కోసమే బీజేపీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం**

**ఓటర్లను బెదిరిస్తున్నారంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు**

**రాష్ట్రానిది కేవలం ఉచిత బస్సు పథకం మాత్రమేనని వ్యాఖ్య**



**తెలంగాణబ్యూరో, సిద్దిపేట పవర్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సన్నబియ్యం పథకాన్ని ఆపేస్తామని ముఖ్యమంత్రి ప్రజలను భయపెడుతున్నారని, దమ్ముంటే ఆ పథకాన్ని ఆపి చూడాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో ఆదివారం ..మిగతా 2లో

## వాషింగ్టన్ సుందర్ మెరుపులు..

## ఆసీస్ పై భారత్ ఘన విజయం..!

187 పరుగుల భారీ లక్ష్యాన్ని 18.3 ఓవర్లలోనే ఛేదించిన భారత్

23 బంతుల్లో 49 పరుగులు చేసిన వాషింగ్టన్ సుందర్

5 వికెట్ల తేడాతో గెలిచి సత్తా చాటిన టీమిండియా



4

## పేదల ఇళ్ల కూల్చివేతపై రాహుల్ గాంధీ
# మౌనం ఎందుకు?

**మొదటిపేజీ తరువాయి**

వల్ల నష్టపోయిన పలువురు బాధితులు కూడా ఈ సమావేశంలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం రాజధానిలో అరాచకం సృష్టిస్తోందని, దీని వల్ల ఎంతోమంది నిరాశ్రయులవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ధనికులను వదిలేసి, పేదలపైనే ప్రతాపం చూపిస్తోందని కేటీఆర్ విమర్శించారు. చెరువులను కబ్జా చేసి ఓ రెవెన్యూ మంత్రి ఇల్లు కట్టుకున్నారని, హిమాయత్ సాగర్ సమీపంలో మరో మంత్రి వివేక్ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు కట్టుకున్నా హైడ్రా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని అన్నారు. "పేదలు కోర్టుకు వెళ్లే సమయం కూడా ఇవ్వకుండా ఇళ్లు కూల్చేస్తున్నారు. కానీ, సీఎం సోదరుడికి మాత్రం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే అవకాశం కల్పించారు. ఇదేనా మీ న్యాయం?" అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెరువు మధ్యలో ఇల్లు కట్టినా నోటీసులు ఇచ్చే ధైర్యం కూడా హైడ్రాకు లేదని ఆయన ఎద్దేవా చేశారు.

గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణాలు జరిగాయని కేటీఆర్ గుర్తు చేశారు. "హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాం. వైట్‌హౌస్‌తో పోటీపడేలా సచివాలయం నిర్మించాం. దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. 42 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ప్రతి జిల్లాలో కలెక్టరేట్లు, భారీ సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేశాం. కానీ, ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి సర్కార్ చేసింది కేవలం కూల్చివేతలే" అని ఆయన దుయ్యబట్టారు. కూల్చివేతల సందర్భంగా ఒక గర్భిణిని తోసేశారని, మూడు సంవత్సరాల చిన్నారి ఆకలితో అలమటించిందని చెబుతూ సంబంధిత ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. ఇంకో 500 రోజుల్లో తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక బాధితులందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# హైదరాబాద్ ఓటర్లకు కేటీఆర్ విజ్ఞప్తి

- **గ్రామీణ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయారు**
- **ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పాత్రను అద్భుతంగా పోషిస్తున్నాం**
- **బీఆర్ఎస్ హయాంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం**
- **గ్రామీణ ప్రాంతాల్లో కంటే హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుంది**
- **విద్యావంతులు ఉన్న HYDలో ఓటింగ్ శాతం తక్కువ ఉండటం బాధాకరం**
- **ఓటు వేసేందుకు ముందుకు రాకుంటే.. రిగ్గింగ్ జరిగే అవకాశం ఎక్కువ. -కేటీఆర్**

**తెలంగాణబ్యూరో, సిద్దిపేట పవర్**



జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం వేగంగా సాగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం షేక్‌పేట్‌లోని ఆదిత్య ఇంప్రెస్ గేటెడ్ కమ్యూనిటీని సందర్శించారు. ఆయనతో పాటు మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందని చెప్పారు. కేటీఆర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనేది మా ప్రియమైన నాయకుడు మాగంటి గోపీనాథ్ గారి అకాల మరణంతో వచ్చిన ఎన్నిక. మాగంటి కుటుంబం ఈ నియోజకవర్గంలో ఎంతో సేవ చేసింది. అందుకే వారి భార్య మాగంటి సునీతమ్మకు టికెట్ ఇచ్చాం. మా పార్టీ ఎప్పుడూ తమ నాయకుల కుటుంబాలను గౌరవంగా చూసుకుంటుంది అని అన్నారు. "సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్‌లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఎందుకంటే నగర ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు. మా పాలనలో ఐటీ రంగం అద్భుతంగా అభివృద్ధి చెందింది, దేశ నలుమూలల నుంచి ఉద్యోగాల కోసం యువత హైదరాబాద్‌కి వస్తున్నారు. కోవిడ్ సమయంలో కూడా ఆ అవకాశాన్ని వదిలిపెట్టకుండా అనేక నిర్మాణ పనులు, ఫ్లైఓవర్లు, మెట్రో ప్రాజెక్టులు చేపట్టాం. ఇప్పటివరకు 42 ఫ్లైఓవర్లు, 70 కిలోమీటర్ల మెట్రో నిర్మాణం పూర్తి చేశాం" అని వివరించారు. "వ్యవసాయ రంగంలో తెలంగాణ ఇప్పుడు పంజాబ్, హర్యానాలకు సాటి అవుతోంది. రైతులకు పెట్టుబడి సాయం అందించడంతో ఇది సాధ్యమైంది. ఒకప్పుడు నగరంలో జనరేటర్లు, వాటర్ ట్యాంకర్లు తప్పనిసరిగా కనిపించేవి, కానీ ఇప్పుడు కరెంట్ కోతలు, నీటి కొరత లేని స్థాయికి అభివృద్ధి చేసాం. హరితహారంతో రాష్ట్రాన్ని గ్రీన్ ఎకానమీగా మార్చాం" అని కేటీఆర్ తెలిపారు. "హైదరాబాద్‌లో విద్యావంతులు ఎక్కువగా ఉన్నా, ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుంది. ఇది బాధాకరం. మీరు ఓటు వేయడానికి రాకపోతే రిగ్గింగ్‌కి అవకాశం కలుగుతుంది. కాబట్టి ప్రతి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలి," అని కేటీఆర్ అన్నారు. "అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకున్నాం. సంక్షేమ పథకాలతో ప్రతి వర్గం లబ్ధి పొందింది. గంగా-జమున తహసీబ్ సంస్కృతిని కాపాడాం. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం గ్రామీణ ప్రజలను మోసం చేసింది. అయినా కేవలం ఒకటిన్నర శాతం తేడాతోనే బీఆర్ఎస్ ఓడిపోయింది," అని ఆయన తెలిపారు.

# దమ్మున్నంటే ఆ పథకం ఆపండి...

**మొదటిపేజీ తరువాయి**



ఆయన మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. "సన్నబియ్యం పథకం కాంగ్రెస్‌ది కాదు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ఉచిత బియ్యం పథకంలో భాగం. ఈ పథకంలో కేంద్రం కిలో బియ్యానికి రూ.42 భరిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది కేవలం రూ.15 మాత్రమే. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి, పథకాన్ని ఆపేస్తామని బెదిరించడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే" అని స్పష్టం చేశారు. ఓటు వేయకపోతే పథకాలు ఆపేస్తామని బెదిరించడంపై ఇప్పటికే బీజేపీ తరఫున ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మజ్లిస్ ఓట్లను దక్కించుకోవడానికే కాంగ్రెస్ పార్టీ బీజేపీపై విమర్శలు చేస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా అమలు చేస్తున్న ఏకైక పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ప్రజలను బెదిరించేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. కిషన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలతో ఉప ఎన్నికల ప్రచారం మరింత వేడెక్కింది.

## కేటీఆర్ హైడ్రా వ్యాఖ్యలపై
# ఎంపీ చామల కౌంటర్

- **కేటీఆర్ హైడ్రా వ్యాఖ్యలపై చామల తీవ్ర విమర్శలు**
- **బీఆర్ఎస్ పాలనలో చెరువులు, భూముల కబ్జాలు వెల్లడి**
- **హైడ్రా ఏర్పడిన తర్వాత వేల ఎకరాలు రక్షించబడ్డాయన్న ఎంపీ**
- **హైడ్రా ప్రజల రక్షణకే పనిచేస్తోందని స్పష్టం చేసిన చామల**

**తెలంగాణబ్యూరో, సిద్దిపేట పవర్**



కేటీఆర్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌ను భూతంలా చూపించే ప్రయత్నం కేటీఆర్ చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓట్లు దండుకోవడానికే కేటీఆర్ హైడ్రా అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువులు, నాళాలు, ప్రభుత్వ భూములను కాపాడేందుకే సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో విచ్చలవిడిగా పర్మిషన్లు ఇచ్చినందువల్లే ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయని ఆయన విమర్శించారు. తెలంగాణ, హైదరాబాద్‌లో 75 శాతం చెరువులు, నాళాలు ఆక్రమణలకు గురయ్యాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించిందని గుర్తు చేశారు.

హైదరాబాద్‌లో 600 చెరువుల్లో 44 చెరువులు పూర్తిగా మాయం కాగా, 127 చెరువులు సగం వరకు కబ్జాలకు గురయ్యాయని వివరించారు. కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పదేళ్లు ఉన్నప్పటికీ చెరువుల కబ్జాలను నివారించేందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే హైడ్రా వంటి సమస్యలు పుట్టుకొచ్చేందుకు కారణమని వ్యాఖ్యానించారు. హైడ్రా ఏర్పడ్డ తర్వాత ప్రభుత్వ భూములు, చెరువులు, నాళాలు పెద్ద ఎత్తున రక్షించబడ్డాయని ఎంపీ చామల వివరించారు. శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట్‌లో 39 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన ఘటనలో హైడ్రా జోక్యంతో 29 ఎకరాలు కాపాడబడ్డాయని చెప్పారు. అదేవిధంగా 500 ఎకరాల ప్రభుత్వ భూమి, 360 చెరువులు, 20 నాళాలు, 38 పార్కులపై జరిగిన ఆక్రమణలను హైడ్రా తొలగించిందని వివరించారు. "దేవరయాంజాల్‌లో ప్రభుత్వ భూములు, గచ్చిబౌలిలో ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్లాట్ ఓనర్ల భూములను హైడ్రా రక్షించింది. హైడ్రా ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదు, అధికార దుర్వినియోగాలను వెలుగులోకి తేవడానికే ఏర్పడింది," అని చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. "హైదరాబాద్‌ను న్యూయార్క్, లండన్‌లా మారుస్తామన్న వాగ్దానాలు కేసీఆర్ హయాంలో మాయమయ్యాయి. ఇప్పుడు ఎన్నికల దృష్ట్యా కేటీఆర్ హైడ్రాపై వ్యాఖ్యలు చేస్తున్నారు. హైడ్రా వల్ల లబ్ధి పొందిన ప్రజలే నిజం చెప్పాలి," అని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ నూతన కమిటీని ప్రకటించిన కవిత

- **కమిటీ వివరాలను వెల్లడించిన జాగృతి అధ్యక్షురాలు కవిత**
- **అధ్యక్షుడిగా మోరం వీరభద్రరావు నియామకం**
- **ప్రధాన కార్యదర్శిగా జాడి శ్రీనివాస్‌కు బాధ్యతలు**
- **టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీకి సూచన**

**తెలంగాణబ్యూరో, సిద్దిపేట పవర్**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంస్థాగత నియామకాలపై దృష్టి సారించారు. జాగృతి అనుబంధ విభాగమైన "జాగృతి టీచర్స్ ఫెడరేషన్" నూతన కార్యవర్గాన్ని ఆమె ప్రకటించారు. ఈ మేరకు జాగృతి అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మోరం వీరభద్రరావును, ఉపాధ్యక్షుడిగా బుర్ర రమేష్‌గౌడ్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా జాడి శ్రీనివాస్, కోశాధికారిగా ఘనపురం దేవేందర్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని కవిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సమాజ అభ్యున్నతి, నవ తెలంగాణ నిర్మాణ లక్ష్యంతో తెలంగాణ జాగృతి పనిచేస్తోందని తెలిపారు. కొత్తగా నియమితులైన బాధ్యులు విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు ఫెడరేషన్ చురుకైన పాత్ర పోషించాలని ఆమె సూచించారు.

## కుల గణనలో తెలంగాణకు జాతీయ స్థాయి గుర్తింపు

- **కోకాపేటలో మున్నూరు కాపు భవన నిర్మాణానికి హామీ**
- **బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై మంత్రి స్పష్టం**
- **జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌కు మున్నూరు కాపుల మద్దతు**

**తెలంగాణబ్యూరో, సిద్దిపేట పవర్**



కుల గణనలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం మూసాపేటలోని మెజెస్టిక్ గార్డెన్స్‌లో జరిగిన మున్నూరు కాపు, కాపుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోకాపేటలో మున్నూరు కాపు భవనం నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీసీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు చట్టపరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ అంశం ప్రస్తుతం కోర్టులో ఉన్నందున, చట్టబద్ధ మార్గంలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. బలహీన వర్గాలన్నీ ఐక్యంగా పోరాడితేనే తమ హక్కులు సాధ్యమవుతాయని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మున్నూరు కాపు, కాపుల వర్గం నుండి ఏకగ్రీవ మద్దతు లభించిందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతాము

- **రాపోలు నర్సింలు**

**షాబాద్,నవంబర్ 02 (సిద్దిపేట పవర్):**




42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో 22వ రోజు షాబాద్ మండల తమ్మలిసంఘం నాయకులు తమ్మలి రవీందర్ తమ్మలి రమేష్ తమ్మాలి నరేందర్ తమ్మాలి అనంతయ్య తమ్మలి శ్రీనివాస్ రిలే నిరాహార దీక్షకు కూర్చోవడం జరిగింది వారికి సంఘీభావంగా సాధన సమితి సభ్యులు చేవెళ్ల స్వామి జడల రాజేందర్, రాపోలు నర్సింలు మాట్లాడుతూ మేమెంతో మాకు అంత మేమెంతో మాకు అంత వాటా కావాలని రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం చేస్తామని అలాగే విద్య,ఉపాధిలో కూడా 42 శాతం రిజర్వేషన్లు కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాము,రమేష్ యాదవ్,గడ్డం చెంద్రయ్య,సందీప్,ప్రవీణ్, దీపక్,అశోక్,తాడేపల్లి శ్రీనివాస్,పద్మనాభం, రాము,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కేకే సర్వే రిపోర్ట్‌పై కాంగ్రెస్ ఆగ్రహం..

- **ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిందని ఆరోపణ**
- **కేటీఆర్, హరీష్ డైరెక్షన్‌లో సర్వే విడుదల**
- **ఎలక్షన్ కమిషన్ వద్దకు ఫిర్యాదు : బల్మూరి వెంకట్**

**తెలంగాణబ్యూరో, సిద్దిపేట పవర్**



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సర్వే వివాదం రచ్చరేపుతోంది. కేకే సర్వే సంస్థ విడుదల చేసిన సర్వే రిపోర్ట్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్‌ఓ) సాయిరాం ను కలసి అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ భేటీ కోట్ల విజయభాస్కర్ ఇండోర్ స్టేడియంలో జరిగింది.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, కేకే సర్వే సంస్థ విడుదల చేసిన సర్వే పూర్తిగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిందని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్న సమయంలో ఇలాంటి సర్వేలను ప్రచురించడం నిషేధమని గుర్తు చేశారు. అయితే కేకే సర్వే ఉద్దేశపూర్వకంగానే విడుదలైందని, ప్రజలను ప్రభావితం చేసే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. కేకే సర్వే రెండు గంటల్లోనే తయారు చేసిన ఒక లిస్ట్‌ను "సర్వే రిపోర్ట్"గా విడుదల చేసిందన్నారు. ఇది పూర్తిగా కేటీఆర్, హరీష్ రావు డైరెక్షన్‌లో జరిగిన చర్య అని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఈ సర్వే ఉపయోగపడిందని అన్నారు.

గతంలో హర్యానాలో కూడా కేకే సర్వే సంస్థ ఇలాగే అడ్డగోలుగా సర్వేలను విడుదల చేసి, ఫలితాలు అసలు వాస్తవాలకు పొంతన లేకుండా ఉన్నాయని గుర్తు చేశారు. ఇలాంటి తప్పుడు సర్వేల ద్వారా ప్రజల అభిప్రాయాలను మలుపు తిప్పే ప్రయత్నాలు అంగీకారయోగ్యం కాదని వారు పేర్కొన్నారు. కేకే సర్వే సంస్థపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఓను కోరిన ఎమ్మెల్సీలు, రేపు ఎలక్షన్ కమిషన్ కమిషనర్‌ను ప్రత్యక్షంగా కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అదనంగా సెంట్రల్ ఎలక్షన్ కమిషన్‌కు కూడా మెయిల్ ద్వారా ఫిర్యాదు పంపనున్నట్లు చెప్పారు. "జూబ్లీహిల్స్‌లో ఓటమి ఖాయం అని తెలుసుకున్న కేటీఆర్, హరీష్ రావు ఇలాంటి డ్రామాలకు దిగుతున్నారు. కానీ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారు. మా అభ్యర్థి ఘన విజయాన్ని సాధిస్తారని సంపూర్ణ విశ్వాసం ఉంది," అని బల్మూరి వెంకట్ అన్నారు.

## షాద్‌నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత.. మహిళా కానిస్టేబుల్‌పై విద్యార్థినుల దాడి

- **ప్రిన్సిపల్ వేధింపులపై విద్యార్థినుల ఆందోళన**
- **షాద్‌నగర్ చౌరస్తాలో ధర్నాతో ఉద్రిక్తత**
- **మహిళా కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్న విద్యార్థినులు**
- **పోలీసులు, విద్యార్థినుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట**
- **కలెక్టర్ వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టీకరణ**
- **కొందరు విద్యార్థినులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**తెలంగాణబ్యూరో, సిద్దిపేట పవర్**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు చేపట్టిన ఆందోళన ఘర్షణకు దారితీసింది. ప్రిన్సిపల్ అక్రమాలకు పాల్పడుతున్నారని, తమను వేధిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థినులు పట్టణ చౌరస్తాలో ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆందోళనను అదుపు చేసేందుకు యత్నించిన ఓ మహిళా కానిస్టేబుల్‌పై విద్యార్థినులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే, కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో ఓ మహిళా కానిస్టేబుల్‌కు, విద్యార్థినులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆమె ఓ విద్యార్థినిపై చేయి చేసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఆగ్రహానికి గురైన తోటి విద్యార్థినులు ఏకమై మహిళా కానిస్టేబుల్‌పై తిరగబడ్డారు. "న్యాయం చేయమని అడిగితే మమ్మల్నే కొడతారా?" అంటూ పోలీసులను నిలదీశారు. ఈ అనూహ్య పరిణామంతో పోలీసులు, స్థానికులు నిశ్చేష్టులయ్యారు. జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి తమ సమస్యలు విని, పరిష్కారం చూపే వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థినులు తేల్చిచెప్పారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కొందరు విద్యార్థినులను బలవంతంగా వాహనంలోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో షాద్‌నగర్ పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విద్యార్థినుల ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఆందోళన కారణంగా జాతీయ రహదారిపై కూడా కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## శ్రీ రేణుకా మాత అమ్మవారిని దర్శించుకున్న హోంగార్డు రవీందర్ గౌడ్ దంపతులు

**దుబ్బాక సిద్దిపేట పవర్ నవంబర్ 2 ప్రతి నిధి**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి శ్రీ రేణుకా మాత అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న సిద్దిపేట కోర్టు హోంగార్డు రవీందర్ గౌడ్ దంపతులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అమ్మవారిని దర్శించుకోవడానికి దేవాలయానికి కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకుంటామని అదేవిధంగా మా ఇంటి దేవత అయిన ఎల్లమ్మ తల్లి దయవల్ల మా కుటుంబం అన్ని విధాల అష్ట ఐశ్వర్యాలతో విరాజిల్లుతుందని, అమ్మవారి దర్శనం దైవంగా భావిస్తామని కుటుంబ సభ్యులతో వచ్చిన హోంగార్డ్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా శ్రీ రేణుక మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేసి అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని బహుమానంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుకా మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, క్యాషియర్ కొండ్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## కార్తీకమాసం శివుడికి ఎంతో ప్రీతిపాత్రం

- **ఎమ్మెల్యే తలసాని**

**సికింద్రాబాద్, నవంబర్ 02 (సిద్దిపేట పవర్ ):**

కార్తీక మాసం మహా శివుడికి ఎంతో ప్రీతి పాత్రమైన మాసం అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం బన్సీలాల్ పేట డివిజన్ బోయగూడ ఉప్పలమ్మ దేవాలయం ప్రాంగణంలో శివలింగం, నందీశ్వర పున: ప్రతిష్ట పూజలలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ శ్రీధర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రెసిడెంట్ శ్రీధర్ మాట్లాడుతూ... జీర్ణ స్థాయికి చేరిన ఆలయంలోని శివలింగం నందీశ్వర విగ్రహాలను తొలగించి, వాటి స్థానంలో వేదమంత్రోచ్చారణల మధ్య నూతనంగా ఏర్పాటు చేసిన శివలింగం నందీశ్వరులను ఆగమ శాస్త్రం, శిల్ప శాస్త్ర ప్రకారం పున: ప్రతిష్ట చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, ప్రేమ్ కుమార్,నెరేళ్ళ రవి,శాంతి కుమార్,రంజిత్, లక్ష్మణరావు, ఎంఎం రాజు పాల్గొన్నారు.



## భౌతికంగా దూరంగా ఉన్నా... వారి జ్ఞాపకాలు శాశ్వతంగా ఉంటాయి..

- **ఎమ్మెల్యే తలసాని**

**సికింద్రాబాద్, నవంబర్ 02 (సిద్దిపేట పవర్ ):**

మరణం భౌతికంగా వ్యక్తులను దూరం చేసినప్పటికీ, వారి జ్ఞాపకాలు, వారి పట్ల ఉన్న ప్రేమ మాత్రం శాశ్వతంగా ఉంటుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆత్మల దినం (ఆల్ సోల్స్ డే) సందర్భంగా బన్సీలాల్ పేట డివిజన్ లోని బోయగూడ లో గల క్రిస్టియన్ గ్రేవ్ యార్డ్ లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనల లో పాల్గొన్నారు. ప్రార్ధనల అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను పాదర్ ఆశీర్వచనం చేశారు. ప్రార్ధనల నిమిత్తం గ్రేవ్ యార్డ్ కు వచ్చిన వారికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన వ్యక్తిగతంగా బిస్కెట్స్, వాటర్ బాటిల్స్, జ్యూస్ లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కుర్మ హేమలత, పద్మారావు నగర్ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, మాజీ ఎమ్మెల్సీ స్టీఫెన్ సన్, పాదర్ ఆరోగ్యం, గ్రేవ్ యార్డ్ కమిటీ సభ్యులు జయరాజ్, జ్యుట్ పాల్, నాయకులు మహేందర్ గౌడ్, అంబులెన్స్ సురేష్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.




## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండలం అంతాయిగూడెం గ్రామానికి చెందిన తీగుళ్ల బాలయ్య వయసు 34సం. గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవించే వాడు ఇతనికి ఎనిమిది సంవత్సరాల క్రితం కళ్యాణి అనే మహిళతో వివాహం కాగా ఇప్పటివరకు పిల్లలు కాలేదు. పిల్లలు లేరు అని అప్పుడప్పుడు బాధపడుతుండేవాడు. గత కొద్ది రోజులుగా తీవ్రంగా అలోచించి తీవ్రమణస్థాపం చెందిన బాలయ్య గత నెల 28వ తారీకు రాత్రి అందరూ నిద్రించుచున్న సమయంలో ఇంట్లోనే మద్యం మత్తులో పురుగుల మందు త్రాగి ఆత్మహత్యాయత్నం చేసినాడు. అప్పటినుండి ట్రీట్మెంట్ తీసుకుంటూ ఆదివారం ఉదయం. 10 గంటల సమయంలో సిద్దిపేటలోని లోహిత్ సాయి హాస్పిటల్ లో మృతి చెందారు.భార్య యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించారు.







## వరదరాజ్ పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూర్వాభాద్ర నక్షత్రం పూజలు

- **స్వామివారికి 13 కిలోల వెండి కవచం కిరీటం అలంకరణ**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి:**

మర్కుక్ మండలం వరదరాజ పూర్ గ్రామంలో ఆదివారం పూర్వాభద్ర నక్షత్రం పురస్కరించుకొని, స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి, దాతల సహకారంతో స్వామివారికి వెండి కవచాలు కిరీటం అలంకరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ప్రొద్దుటూరు గోపాలకృష్ణ, శ్రీనివాస్ శర్మ, రామ్మోహన్ శర్మ, అభిలాష్ గుప్తా మాట్లాడుతూ అందరికీ శ్రీ ఆంజనేయస్వామి కరుణ కటాక్షాలు ఉండాలని, వరదరాజ్పూర్ ఆంజనేయస్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం అని దాదాపు 52 నెలలుగా ప్రతినెల పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని దాతల సహకారంతో దాదాపు 13 కిలోల వెండితో స్వామివారి కవచం కిరీటం అలంకరించడం జరిగిందని ఇందుకు సహకరించిన దాతలకు స్వామివారి ఆశీర్వాదం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అమర నాగేందర్ వెంకటేశం అంతని నర్సింలు చేతి రెడ్డి రంగారెడ్డి, గౌడుగు నరసింహులు మాచర్ల సిద్దేశ్వర్ ఆర్యవైశ్యులు,మహిళలు, చిన్నారులు యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ను పరామర్శించిన సర్పంచులు

**దుబ్బాక సిద్దిపేట పవర్ నవంబర్ 2 ప్రతినిధి**

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో దుబ్బాక మండల తాజా మాజీ సర్పంచ్ పెద్ద చీకోడ్తాడ శ్రీనివాస్. గంభీర్ పూర్ తాజా మాజీ సర్పంచ్ కరికే భాస్కర్ కాసా నాగభూషణం. ఆరేపల్లి తాజా మాజీ సర్పంచ్ శెట్టి కృష్ణంరాజు . తాజా మాజీ సర్పంచ్ అచ్చుమాయపల్లిసోమర స్వామి. తిరుపతి రెడ్డి కలిసి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి సత్య నారాయణ రావు ఇటీవల మరణించినందున సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రిహరీష్ రావు ను పరామర్శించి తన్నీరు సత్యనారాయణ రావు ఘనంగా నివాళులు అర్పించారు



## ప్రజా పాలనలో దాడులే లక్ష్యంగా పనిచేస్తున్నారు

- **బి.ఆర్.ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ బంగారీగల్ల కిరణ్**

**చేర్యాల, నవంబర్ 2 (సిద్దిపేట పవర్)**

మణుగూరు బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి చేయడాన్ని చేర్యాల మండల సోషల్ మీడియా కన్వీనర్ బంగారీగల్ల కిరణ్ తీవ్రంగా ఖండించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రజా పాలన లో దాడులే లక్ష్యంగా అధికార పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రవర్తిస్తున్నారు అది ఏ మాత్రం మంచిది కాదు అని కిరణ్ హెచ్చరించారు..మొన్న మడికొండ లో నమస్తే తెలంగాణ కార్యాలయం మీదు కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేశారు అని కిరణ్ గుర్తు చేశారు, అలాంటి దాడులే మేము చేస్తే తీవ్రంగా ఉంటది అని కానీ మేము కేసీఆర్ సైనికులం మేము అలా ప్రవర్తించబోము ఆయన వ్యాఖానించారు..ఇప్పటికీ అయిన రాష్ట్రంలో దాడుల మీద దృష్టి పెట్టకుండా, రాష్ట్రంలో దారిద్యాన్ని పోగొట్టే విధంగా అధికార పార్టీ నాయకులు పని చేయాలని కిరణ్ తెలిపారు..



## లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మైనంపల్లి హన్మంతరావు

- **మైనంపల్లి రోహిత్ జన్మదినం సందర్భంగా నాచారం దేవస్థానం లో ప్రత్యేక పూజలు**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదినం సందర్భంగా వర్గల్ మండలం నాచారం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మైనంపల్లి హన్మంతరావు ,నాచారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నాచారం దేవాలయం అభివృద్ధి చెందటానికి కృషి చేస్తానని మైనంపల్లి హన్మంతరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిసిసి ఆంజనేయులు గౌడ్ మెదక్ జిల్లా గ్రంధాలయ చైర్మెన్ సుహాసిని రెడ్డి ,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బండారు శ్రీకాంత్ రావు,చిట్కుల మహిపాల్ రెడ్డి నాయిని యాదగిరి,సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ఎస్ సి సెల్ అధక్షుడు విజయ్ కుమార్ బంగారు రెడ్డి హన్మంత రెడ్డి శశిభూషణ్ రెడ్డి,గడ్డి వెంకటేష్ యాదవ్ నాచారం డైరెక్టర్లు సంతోష్ పంతులు శ్రీనివాస్ వర్గల్ మండల కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య సుల్తాన్ భాయ్ బిట్ల నవీన్,పిట్ల కృష్ణ, వెంకటేష్ శ్రీకాంత్ మహబూబ్ సాయికుమార్ భాస్కర్ భాను నితిన్ రెడ్డి,నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## హరీష్ రావు ను పరామర్శించిన బీ ఆర్ యస్ నాయకులు

- **సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించిన బీ ఆర్ యస్ నాయకులు**

జగదేవపూర్ మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీశ్ రావు తండ్రి సత్య నారాయణ ఇటీవలే మృతిచెందిన విషయం తెలిసిందే ఆదివారం హరీశ్ రావును హైదరాబాద్ లోని కోకాపేటలో గల వారి స్వగృహం లో జగదేవపూర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు.అదేవిధంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి , నాయకులు శ్రీకాంత్ రెడ్డి, కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ దాచారం కనకయ్య, సదాల కరుణాకర్, కొంపల్లి మహేష్,మచ్చ బాబు, యం డి.ఇస్మాయిల్, ఉమ్మద్ గౌస్, రవి తదితరులు ఉన్నారు.



## అంబేద్కర్ సిద్ధాంతం ప్రతి గ్రామానికి తీసుకెళ్లిన మహనీయుడు కత్తి పద్మారావు

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ నవంబర్ 2 ప్రతినిధి**

డాక్టర్.బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాన్ని ప్రతి గ్రామానికి చేర్చిన ప్రముఖుడు , మేధావి రచయిత బహుముఖ ప్రజ్ఞశాలి మన కాలపు మహానాయకుడు కత్తి పద్మారావు మర్యాద పూర్వకంగా కలిసిన అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలవటం జరిగింది .అఖిల రాజ్ ఫౌండేషన్ పౌండర్ తౌడ సత్యనారాయణ సభ్యులు నాగరాజు జాజుల , హై కోర్టు న్యాయవాది కమ్మరి రామక్రిష్ణ మరియు హై కోర్టు న్యాయవాది రమాకాంత్ ,dr కిరణ్ , OU విద్యార్థి నాయకులు కృష్ణ, రేణు కార్తీక్ ,అరుణ్ కుమారు తదితరులు పాల్గొన్నారు





## మానవతా విలువలు కలిగిన వ్యక్తి సత్యనారాయణ

- **బి.ఆర్.ఎస్ నాయకులు చేతిరెడ్డి సందీప్ రెడ్డి**

**చేర్యాల, నవంబర్ 2 (సిద్దిపేట పవర్)**

మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ గొప్ప మానవతా విలువలు కలిగిన వ్యక్తి అని, ఇపుడు ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమైన విషయం అని, హైదరాబాద్ లోని హరీష్ రావు నివాసంలో సత్యనారాయణ చిత్రపటానికి చేతిరెడ్డి సందీప్ రెడ్డి నివాళులు అర్పించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ ఇంటికి వెళ్లిన చాలా ఆప్యాయంగా మాట్లాడేవారు అని, చివరి సారిగా ఆయనను హాస్పిటల్ లో కలిసి పరామర్శించానని తెలిపారు..రాష్టానికి హరీష్ రావు లాంటి గొప్ప నాయకుడిని అందించిన ఆయన ఎక్కడున్న ఆయన ఆత్మకి శాంతి చేరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు..



## అభిమానులకు షాక్.. అంతర్జాతీయ టీ20లకు కేన్ విలియమ్సన్ గుడ్‌బై

- టెస్టులు, వన్డే కెరీర్‌పై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం
- 93 టీ20 మ్యాచ్‌లలో 2,575 పరుగులు సాధించిన కివీస్ స్టార్
- వెస్టిండీస్‌తో జరగబోయే వైట్-బాల్ సిరీస్‌కు దూరం
- యువ ఆటగాళ్లకు అవకాశం ఇచ్చేందుకే తప్పుకుంటున్నట్లు వెల్లడి
- ఫ్రాంచైజీ టీ20 లీగ్‌లలో మాత్రం ఆడతానని స్పష్టం

**సిద్దిపేట పవర్:**

న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. వన్డే, టెస్టు కెరీర్‌పై మరింత దృష్టి సారించేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు కొన్ని నెలల ముందే ఆయన ఈ ఫార్మాట్ నుంచి తప్పుకోవడం కివీస్ అభిమానులను నిరాశకు గురిచేసింది.

విలియమ్సన్ తన 13 ఏళ్ల టీ20 అంతర్జాతీయ కెరీర్‌లో 93 మ్యాచ్‌లు ఆడి 33 సగటుతో 2,575 పరుగులు చేశాడు. ఇందులో 18 అర్ధశతకాలు ఉన్నాయి. న్యూజిలాండ్ తరఫున టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా ఆయన నిలిచాడు. అంతేకాకుండా, వహించి, రెండుసార్లు (2016, 2022) టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్స్‌కు, ఒకసారి (2021) ఫైనల్‌కు జట్టును చేర్చాడు. తన రిటైర్మెంట్‌పై విలియమ్సన్ మాట్లాడుతూ "చాలా కాలంగా నేను ఈ ఫార్మాట్‌లో భాగమవ్వడాన్ని ఆస్వాదించాను. ఈ ప్రయాణంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. అయితే, నాకూ, జట్టుకూ ఇదే సరైన సమయం అని భావిస్తున్నాను. రాబోయే టీ20 ప్రపంచకప్‌కు ముందు జట్టుకు ఒక స్పష్టత ఇవ్వాలనుకున్నాను. జట్టులో ఎంతో ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లు ఉన్నారు. వారికి మరిన్ని అవకాశాలు ఇచ్చి ప్రపంచకప్‌నకు సిద్ధం చేయాలి. మిచ్ (సాంట్నర్) అద్భుతమైన కెప్టెన్. ఇకపై జట్టును ముందుకు నడిపించాల్సిన బాధ్యత వారిదే. నేను బయట నుంచి మద్దతు ఇస్తాను" అని వివరించాడు. డిసెంబర్‌లో వెస్టిండీస్‌తో జరగనున్న మూడు టెస్టుల సిరీస్‌పై ప్రస్తుతం దృష్టి పెట్టినట్లు విలియమ్సన్ తెలిపాడు. అయితే, ప్రపంచవ్యాప్తంగా జరిగే టీ20 ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆడటం కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశాడు. విలియమ్సన్ నిర్ణయాన్ని న్యూజిలాండ్ క్రికెట్ సీఈవో స్కాట్ వీనింక్ గౌరవించారు. "టీ20 జట్టుకు ఆటగాడిగా, కెప్టెన్‌గా కేన్ అందించిన సేవలు అపారమైనవి. 2021 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో అతను ఆడిన 85 పరుగుల ఇన్నింగ్స్ ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతుంది. అతని కెరీర్‌లోని మిగిలిన ప్రయాణానికి మా పూర్తి మద్దతు ఉంటుంది" అని వీనింక్ తెలిపారు.



# మూడో టీ20లో భారత్ ఘన విజయం.. ఆసీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపు!

- 187 పరుగుల భారీ లక్ష్యాన్ని 18.3 ఓవర్లలోనే ఛేదించిన భారత్
- 23 బంతుల్లో 49 పరుగులు చేసిన వాషింగ్టన్ సుందర్
- 5 వికెట్ల తేడాతో గెలిచి సత్తా చాటిన టీమిండియా

**సిద్దిపేట పవర్:**





ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయం సాధించింది. ఆసక్తికరంగా సాగిన ఈ పోరులో భారత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 187 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 49 నాటౌట్) చెలరేగగా, జితేష్ శర్మ (13 బంతుల్లో 22 నాటౌట్) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి మెరుపులతో భారత్ మరో 9 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. హోబర్ట్‌లోని బెల్లెరైవ్ ఓవల్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. ఆరంభంలో వికెట్లు కోల్పోయి తడబడిన ఆసీస్‌ను టిమ్ డేవిడ్ (38 బంతుల్లో 74), మార్కస్ స్టోయినిస్ (39 బంతుల్లో 64) ఆదుకున్నారు. వీరిద్దరూ అద్భుతమైన హాఫ్ సెంచరీలతో జట్టుకు భారీ స్కోరు అందించారు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ 3 వికెట్లతో రాణించగా, వరుణ్ చక్రవర్తి రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 187 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు మంచి ఆరంభం లభించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (25), శుభ్‌మన్ గిల్ (15) వేగంగా ఆడారు. ఆ తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (24), తిలక్ వర్మ (29), అక్షర్ పటేల్ (17) తమ వంతు సహకారం అందించారు. కీలక సమయంలో వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ ఆరో వికెట్‌కు అజేయంగా 43 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ మూడు వికెట్లు తీసినప్పటికీ, మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకోవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. ఈ విజయంతో ఐదు మ్యాచ్ ల సిరీస్ ను భారత్ 11తో సమం చేసింది. ఇరు జట్ల మధ్య నాలుగో వన్డే నవంబరు 6న గోల్డ్ కోస్ట్ లో జరగనుంది.

# పంత్ కెప్టెన్ ఇన్నింగ్స్... కంబోజ్ మెరుపులు... అనధికారిక టెస్టులో భారత్‌ఏ థ్రిల్లింగ్ విన్

- సౌతాఫ్రికా 'ఏ'తో జరిగిన తొలి అనధికారిక టెస్టులో భారత్ 'ఏ' విజయం
- 3 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించిన భారత జట్టు
- కెప్టెన్ రిషభ్ పంత్ 90 పరుగులతో కీలక ఇన్నింగ్స్
- చివర్లో అద్భుతంగా ఆడిన అన్షుల్ కంబోజ్ (37 నాటౌట్)
- 275 పరుగుల లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి ఛేదించిన భారత్ 'ఏ'
- రెండు ఇన్నింగ్స్‌లలోనూ విఫలమైన భారత టాపార్డర్

**సిద్దిపేట పవర్:**



సౌతాఫ్రికా 'ఏ' జట్టుతో జరిగిన తొలి అనధికారిక టెస్టులో భారత్ 'ఏ' జట్టు 3 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. కెప్టెన్ రిషభ్ పంత్ (90) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌కు, చివర్లో అన్షుల్ కంబోజ్ (37 నాటౌట్) ఆడిన మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో భారత జట్టు లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 10 ఆధిక్యంలో నిలిచింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 'ఏ' ఆదిలోనే తడబడింది. టాపార్డర్ బ్యాటర్లు సాయి సుదర్శన్, ఆయుష్ మాత్రే, దేవదత్ పడిక్కల్ స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ పంత్, ఆయుష్ బదోనితో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. పంత్ 113 బంతుల్లో 90 పరుగులు చేసి జట్టును విజయానికి చేరువ చేశాడు. అయితే, సెంచరీకి చేరువలో పంత్, ఆ తర్వాత బదోని ఔట్ కావడంతో మ్యాచ్ మళ్లీ ఉత్కంఠగా మారింది. ఈ క్లిష్ట సమయంలో లోయర్ ఆర్డర్ బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. తనుష్ కోటియన్ (23) వేగంగా పరుగులు చేయగా, అన్షుల్ కంబోజ్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 31 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 37 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి మానవ్ సుతార్ నుంచి చక్కటి సహకారం అందడంతో భారత్ 'ఏ' 73.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. అంతకుముందు, తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 'ఏ' 309 పరుగులు చేయగా, భారత్ 'ఏ' 234 పరుగులకే ఆలౌటైంది. దీంతో దక్షిణాఫ్రికాకు 75 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు రాణించడంతో దక్షిణాఫ్రికా జట్టు 199 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో తనుష్ కోటియన్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 8 వికెట్లు పడగొట్టాడు.

## హైదరాబాద్‌కు రానున్న ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ

- డిసెంబర్‌లో భారత్‌లోని పలు నగరాల్లో పర్యటించనున్న మెస్సీ
- కేరళ పర్యటన రద్దవడంతో హైదరాబాద్‌కు వేదిక మార్పు
- కోల్‌కతా, హైదరాబాద్, ముంబై, ఢిల్లీ నగరాల్లో సందడి చేయనున్న మెస్సీ

**సిద్దిపేట పవర్:**

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ త్వరలో తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు రానున్నారు. డిసెంబర్‌లో ఆయన భారత పర్యటనకు రానుండగా, దేశంలోని పలు ప్రధాన నగరాల్లో సందడి చేయనున్నారు. తొలుత దక్షిణాదిన కేరళలో పర్యటించాలని అనుకున్నప్పటికీ, ఆ వేదిక రద్దయింది. దీంతో మెస్సీ కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు మార్చాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

భారత్ పర్యటనలో భాగంగా కోల్‌కతా, హైదరాబాద్, ముంబై, ఢిల్లీ నగరాల్లో మెస్సీ సందడి చేయనున్నారు. దక్షిణాదిలో లక్షలాది మంది ఫుట్‌బాల్ అభిమానుల కోసం హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు భారత్‌లో మెస్సీ పర్యటన నిర్వాహకుడు సతాద్రు దత్తా వెల్లడించారు. వారం రోజుల్లో బుకింగ్‌లు ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు.వేదిక విషయానికి వస్తే గచ్చిబౌలి లేదా రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 1213 అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున మెస్సీ కోల్‌కతాకు చేరుకుంటారు. సాల్ట్ లేక్ స్టేడియంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ చేరుకుంటారు. డిసెంబర్ 14న ముంబై, డిసెంబర్ 15న ఢిల్లీలో పర్యటిస్తారు. ఆ రోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనూ ఆయన భేటీ కానున్నారని నిర్వాహకులు తెలిపారు.



# రాజస్థాన్ రాయల్స్‌కు సంజు శాంసన్ గుడ్ బై.. ఏ జట్టుకు మారుతున్నాడో తెలుసా!

**సిద్దిపేట పవర్:**

రాజస్థాన్ రాయల్స్ టీంకు వచ్చే ఐపీఎల్ సీజన్‌లో సంజు శాంసన్ గుడ్ బై చెప్పే ఛాన్స్‌లు ఎక్కువగా ఉన్నాయని పలు నివేదికలు చెబుతున్నాయి. సంజు ఢిల్లీ క్యాపిటల్స్‌కు మారడం దాదాపు ఖాయం అని సమాచారం. రాజస్థాన్ సంజును ఢిల్లీకి ఇవ్వాలని పరిశీలిస్తున్నట్లు క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విషయంపై రెండు ఫ్రాంచైజీలు పరస్పర ఒప్పందానికి కూడా వచ్చినట్లు సమాచారం. సంజును కొనుగోలు చేయడానికి ఢిల్లీ కూడా చాలా ఆసక్తిగా ఉందని, కానీ దాని ప్రధాన ఆటగాళ్లను రాజస్థాన్‌కు ఇవ్వడానికి ఇష్టపడటం లేదని అంటున్నారు. ప్రతిగా ఢిల్లీ తన రూ.10 కోట్ల విలువైన ఆటగాడు ట్రిస్టాన్ స్టబ్స్‌ను రాజస్థాన్‌కు ఇవ్వడానికి అంగీకరించిందని తెలుస్తుంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**ఢిల్లీకి సంజు శాంసన్..**

సంజు శాంసన్ గతంలో ఢిల్లీ ఫ్రాంచైజీ తరఫున ఆడాడు. అతను 2016, 2017 ఐపీఎల్ సీజన్లలో ఢిల్లీ డేర్ డెవిల్స్ తరఫున సంజు శాంసన్ బరిలోకి దిగాడు. అప్పట్లో ఆ ఫ్రాంచైజీని ఢిల్లీ డేర్ డెవిల్స్ అని పిలిచేవారు. ఐపీఎల్ 2016లో సంజు 14 మ్యాచ్‌ల్లో 291 పరుగులు సాధించగా, ఐపీఎల్ 2017లో 14 మ్యాచ్‌ల్లో 386 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ కూడా ఉంది. 2018 మెగా వేలంలో సంజు శాంసన్‌ను రాజస్థాన్ రాయల్స్ జట్టుకు కొనుగోలు చేసింది. అప్పటి నుంచి సంజు ఆర్‌ఆర్‌లో భాగంగా ఉన్నాడు. తాజాగా సంజును ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇచ్చి ఆ జట్టు నుంచి కెఎల్ రాహుల్‌ను తన జట్టులోకి తీసుకోవాలని రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ పట్టుదలతో ఉందని నివేదికలు వచ్చాయి. అయితే డీసీ దీనికి అస్సలు అంగీకరించలేదని సమాచారం. జట్టు బ్రాండ్ విలువను పెంచడంలో కెఎల్ రాహుల్ కీలక పాత్ర పోషిస్తాడని ఢిల్లీ క్యాపిటల్స్ విశ్వసిస్తోంది. గత సీజన్‌లో కూడా రాహుల్ అసాధారణంగా రాణించాడు. సంజుకు బదులుగా స్టబ్స్‌ను తమ జట్టులోకి తీసుకోవడానికి రాజస్థాన్ రాయల్స్ ఉత్సాహంగా ఉందని వార్తలు వస్తున్నాయి. అయితే దక్షిణాఫ్రికా ఆటగాడితో పాటు మరో అన్‌క్యాప్డ్ ప్లేయర్‌ను కూడా వాళ్లు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అయితే దీనిని ఢిల్లీ జట్టు పరిగణనలోకి తీసుకోలేదు.



## బాలయ్య కుటుంబానికి పద్మశాలి సంఘం సభ్యులు అండగా

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి :**

పద్మశాలి కులస్తుడు ఆడెపు బాలయ్య వి.మార్ట్ ప్రాంగణంలో జరిగిన అనుమానాస్పందగా మృతి చెందిన విషయం తెలుసుకున్న పద్మశాలి సంఘం అధ్యక్షులు బొల్లి బత్తుల దేవదాసు పాలకమండలి సభ్యులు యువజన సంఘం సభ్యులు కుల పెద్దలు గాడిపల్లి భాస్కర్ ప్రత్యేక చొరవతో యాజమాన్యంతో మాట్లాడి వాదోపవాదాలు జరిపిన పిదప 6 లక్షల రూపాయలు కుల బంధువులు, కోట కిషోర్ ఉపాధ్యక్షులు గాడి పల్లి ఎల్లంరాజు ప్రధాన కార్యదర్శి దేవసాని హనుమన్ దాస్ కోశాధికారి పాసికంటి శ్రీనివాస్ సహాయ కార్యదర్శి కుల బంధువులు గాడిపల్లి బలరాం తలకొక్కుల రాజేశం కుడిక్యాలా రమేష్ తలకొక్కుల మధుసూదన్, సిద్దిపేట జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్ నాగరాజు నేత సబ్బరి చంద్రమౌళి షేర్ల నరసింహులు దీకొండ వేణుగోపాల్ ఎడెల్లి మహేందర్ గుండు కృష్ణ టీచర్ సమక్షంలో ఆడెపు బాలయ్య కుటుంబ సభ్యులకు విమార్ట్ యాజమాన్యం అధినేత కొమురవెల్లి కళాధర్ తో డబ్బులు ఇప్పించడం జరిగింది. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి కులస్తులకు మొదటి సహాయార్థంలో పాల్గొన్న పద్మశాలి కుల బంధువులు మాదాసు కృష్ణ ,నల్ల శివకుమార్, కుల పెద్దలు కుమార్. పద్మశాలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.





## వర్గల్ నవోదయలో వృత్తి మార్గదర్శకత్వం కౌన్సిలింగ్ పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు




జవహర్ నవోదయ విద్యాలయ ,వర్గల్ ,సిద్దిపేట జిల్లాలో వృత్తి మార్గదర్శకత్వం కౌన్సిలింగ్ కు సంబంధించి విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు వర్గల్ నవోదయ పూర్వ విద్యార్థిని శ్రీమతి రేవతి నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సహకారంతో ఒక చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలియజేశారు.రేవతి ఎంచుకున్న అంశము చార్టెడ్ అకౌంటెన్సీ విద్యార్థిని విద్యార్థులు చాలా మటుకు ఇంజనీరింగ్ మెడిసిన్ విభాగాలపై ఎక్కువ మక్కువ చూపిస్తున్నారని కానీ ఇతర రంగాల్లో కూడా చక్కటి అవకాశాలు ఉన్నాయని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. చార్టెడ్ అకౌంటెన్సీ కోర్సులో చేరడానికి అందులో విజయం సాధించడానికి గల అవకాశాలను ఆమె చక్కటి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థిని విద్యార్థులందరికీ అవగాహన కల్పించారు. ఈ వృత్తిని ఎంచుకున్న ఎంతోమంది ఈరోజుల్లో లక్షల్లో జీతాలు గడిస్తూ పెద్ద పెద్ద కంపెనీలకు సలహాదారులుగా పని చేస్తున్నారని ఆమె విద్యార్థిని విద్యార్థులకు అవగతం చేశారు. పదవ తరగతి నుంచి ఈ కోర్సు పట్ల విషయ సేకరణ చేస్తూ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్లో చక్కటి ప్రతిభ ప్రదర్శించి వృత్తి నైపుణ్యాన్ని అలవర్చుకోవచ్చునని ఆమె ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వము నూతన విద్యా విధానం 2020 లో ఈ కోర్సుకు ఎంతో ప్రాముఖ్యతను ఇవ్వడము జరిగిందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో చదివిన విద్యార్థిని విద్యార్థులు పరిపూర్ణ వికాసానికై పాటుపడుతున్నందుకు ఆమె వారిని అభినందించారు .ఈ కోర్స్ విషయంలో ముందు ముందు ఏమన్నా సందేహాలు ఉన్నా తాను నివృత్తి చేయడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆమె తెలియజేశారు. ఇటువంటి చక్కటి సమాచార పరిజ్ఞానాన్ని ఇచ్చే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సాయినాథ్ రెడ్డి కి ఇతర సంఘ సభ్యులకు విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీ రాజేందర్ కృతజ్ఞతలు తెలియజేశారు. చక్కటి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు అధ్యాపక బృందానికి విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావునీ పరామర్శించిన నంగునూరు మండల జర్నలిస్టులు

**నంగునూర్, నవంబర్ 2 (సిద్దిపేట పవర్)**

మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు ఇటీవల అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం రోజు నంగునూరు మండల జర్నలిస్టులు ముష్కీర్ పరశురాములు, చల్లారం రాజశేఖర్ రెడ్డి, వడితం కిరణ్ కుమార్ ,పరకాల రాకేష్ లు మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ని పరామర్శించి తన్నీరు సత్యనారాయణ రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



# ఉత్సాహంగా ఉచిత మెగా వైద్య శిభిరం

- **ప్రారంభించిన సిద్దిపేట పట్టణ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు**
- **6 రకాల వ్యాధులకు సంబంధించిన చికిత్స పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహించారు**
- **అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు**
- **ఆనందం వ్యక్తం చేసిన రోగులు**
- **ఉత్సాహవంతంగా సేవలు అందించిన వైద్య బృందం**

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నందు సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వాసవి క్లబ్స్ ఆధ్వర్యములో అగస్థ్య హాస్పిటల్ వారిచే నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిభిరం కి బారి స్పందన లభించింది. వైద్యం స్వీకరించిన రోగులు వారి యొక్క ఆరోగ్య సమస్యలకు పరిష్కారం పొందినారు. వైద్యుల బృందం చే చికిత్సలు నిర్వహించిన పిదప వారి సలహా మేరకు ఈసిజి, టుడీ ఎకో, బీపీ, మధుమేహం, బియండి ఇతర పరీక్షలు కూడా ఉచితముగా నిర్వహించారు. వాటిని పరిశీలించి రోగులకు వైద్యులు సరైన సలహాలు అందించారు వైద్యుల మాటల ద్వారా ఆరోగ్యం కాపాడుకోవటానికి కావలిసిన సూచనలు తెలియజేశారు.. ఈ కార్యక్రమాన్ని సిద్దిపేట బల్దియా చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్ గార్లు హాజరయ్యి వారు మాట్లాడుతూ ఈ వైద్య శిభిరం నిర్వహించడం ఎంతో మందికి మేలు జరుగుతుందని అని కార్పోరేట్ తరహా వైద్యం ఇక్కడ అందించబడింది ఈ కార్యక్రమ నిర్వహణకు ఎస్ ఆర్ శేఖర్ కరీంనగర్ ముఖ్య పాత్ర వహించారు అని నిర్వహణ నిబద్ధతో నిర్వహించబడింది అని నిర్వాహకులను అభినందించారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తణుకు ఆంజనేయులు ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల మేము.చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నాము అని అవకాశాలు బట్టి రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అనుకూలమైన చోట వీరి సహాయముతో ఇంకా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగ పడే విధముగా నిర్వహిస్తాము అని తెలియజేశారు.ఈ కార్యక్రమములో డా ఎస్ రాంకమల్, డా. పి ప్రవీణ్ రెడ్డి, డా వై వినోద్ బాబు, రాఘవపురం రాహుల్, డా ఆర్ సురేష్, డా. ఆర్ సురేష్ రెడ్డి, డా. హెచ్ సుధాకర్ రెడ్డి, వైద్య సేవలు అందజేశారు వీరితో పాటు, సమన్వయ కర్త ఏ శ్రీనివాస్ పరీక్షలు నిర్వహించేందుకు వాటికి సంబంధించిన టెకినీసియన్స్ నర్సింగ్ టీమ్ ఇతర సహాయక సిబ్బంది సేవలు అందించారు వీరి అందరిని నిర్వాహకుల చేతుల మీదుగా గౌరవ సన్మానం నిర్వహించి వైద్య బృందానికి సన్మానం చేసి వారిని అభినందించారు.సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మాంకాల నాగరాణి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి డా. నవీన్ కుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సహాయ కార్యదర్శి హేమలత, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి గంప కృష్ణమూర్తి, పి ఆర్ ఓ నీరుమల్ల రవీందర్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పుల్లూరి శివకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్వపల్లి హరికిరణ్, సీనియర్ జర్నలిస్ట్ కొమరవెల్లి అంజయ్య, జిల్లా సేవాదళ్ విభాగం అధ్యక్షులు డా. రావికంటి చంద్రశేఖర్, వాసవి క్లబ్ అధ్యక్షులు కుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలు మంజుల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొమరవెల్లి చంద్రశేఖర్, కోశాధికారి చిగుళ్లపల్లి విష్ణుమూర్తి, సహాయ కార్యదర్శి శివకుమార్, సలహాదారు కాచం కాశీనాథ్ మరియు వాసవి క్లబ్స్ మరియు మహాసభ నాయకులు యాద శ్రీనివాస్, మాంకాల సంతోష్, మర్యాల వీరేశం, పుల్లూరి శశాంక్, అయిత చంద్రశేఖర్, టి శంకరయ్య, లింగా శ్రీనివాస్, శ్రవణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు..













## మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు, కార్యనిర్వాహ అధ్యక్షులు గా చేపూరికనక గౌడ్, గంభీర్ పూర్. అశోక్ గౌడ్ ల నియామకం

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ నవంబర్ 2 ప్రతినిధి**



ఈరోజు నిర్మల్ జిల్లా భైంసా పట్టణ కేంద్రం లోని శ్రీ సరస్వతి గౌడ సంఘం భవనంలో గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నిర్మల్ జిల్లా ముఖ్యుల సమావేశం నక్కల మోహన్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, రాష్ట్ర కోశాధికారి గర్గుల మురళి గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల రాజేందర్ గౌడ్, తీగల వెంకట్ గౌడ్, యాగండ్ల దశాగౌడ్ పాల్గొన్నారు.

పై నాయకులు మాట్లాడుతూ: కల్లుగీత వృత్తి రక్షణ గౌడ కులస్తుల ఐక్యత కోసం మోకుదెబ్బ కృషి చేస్తుందన్నారు. గ్రామాలలో విడిసిల పేరిట కల్లుగీత కార్మికులపై వేదిస్తూ నిలువు దోపిడి చేస్తున్నారు అన్నారు కల్లు గీత వృత్తి రక్షణ కోసం గౌడ కులస్తులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గౌడ కుల ధమాషా ప్రకారం అన్ని రంగాలలో కుల వాట సాధన కోసం మోకుదెబ్బ కృషి చేస్తుందన్నారు. మును ముందు గ్రామ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు బలమైన నిర్మాణం చేసి 5 లక్షల మందితో హైదరాబాద్ లో భారీ సభలను నిర్వహించారు . అదిశగా గౌడ కులస్తులు ఐక్యంగా ముందుకు రావాలాన్నారు. ఈసమావేశంలో నిర్మల్ జిల్లా నూతన అధ్యక్షులుగా కుబీర్ మండల కేంద్రానికి చెందిన చేపూరి కనక గౌడ్(సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గంభీర్ పూర్) జిల్లా కార్యనిర్వక అధ్యక్షులు (వర్కింగ్ ప్రెసిడెంట్) గా బైంసా పట్టణ కేంద్రానికి చెందిన ముష్కం అశోక్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.వీరిని రాష్ట్ర నాయకులు పూలమాలలు శాలువాలతో గౌడ కులస్తుల సమక్షంలో ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బిల్లోల శరత్ గౌడ్, నక్కల బాబ గౌడ్, గుడిసెల నారాయణ గౌడ్, కొండ అర్జున్ గౌడ్, తాళ్లపల్లి మహేష్ గౌడ్, లింగాల కృష్ణ గౌడ్, పాతూరి రవి గౌడ్, కొండ కృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, బొడ్డు రాజు గౌడ్, కొండ సతీష్ గౌడ్, లింగాల రాజు గౌడ్, లింగాల నర్సాగౌడ్, ముత్యపు వార్ నరేష్ గౌడ్ తాళ్ళ పల్లి రమేష్ గౌడ్, జిల్లా లోని పలు మండలాలలోని గ్రామాల గౌడ కులస్తులు గీత కార్మికులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్‌కు మద్దతుగా పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డా. కోట నీలిమ ప్రచారం

**సికింద్రాబాద్ , నవంబర్ 02 (సిద్దిపేట పవర్ ):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి వి. నవీన్ యాదవ్‌కు మద్దతుగా సోమాజిగూడ డివిజన్ లోని ఎల్లారెడ్డి గూడలో పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కోట నీలిమ ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా దుర్గాదేవి ఆలయంలో నవీన్ యాదవ్ గెలవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ వర్షంలోనే ప్రచారంలో ముందుకు కదిలారు. స్థానిక వ్యాపారస్తులు, అపార్ట్ మెంట్ వాసులతో మమేకం అయ్యారు. ఈ క్రమంలో కూరగాయలు అమ్ముతూ చపాతీలు చేస్తూ ముందుకు నడిచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర పథకాల్ని లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ విస్తరణ, అభివృద్ధి పనుల గురించి వివరించారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. ప్రజలు ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం7 చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానిక ఓటర్లను కోరారు. గత ప్రభుత్వం పదేళ్లలో రాష్టాన్ని అప్పులకుప్పగా మార్చిందని, అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తం అయ్యాయని తెలిపారు. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉన్న మ్యానిఫెస్టోలోని ఒక్కో పథకం అమలు చేస్తూ.. ప్రజలకు ఇచ్చిన మాటను నిలుపుకున్నామని వివరించారు. ఇంకా చేయాల్సింది చాలా ఉందని, ఉప



ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఈ ఉప ఎన్నిక ప్రచారంలో కోట నీలిమ వెంట సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.